# మొదటిసారి

కథాకళి నృత్యం చూచినదగ్గర్నించీ కంటికి కునుకురాదు. దానికితోడు రాత్రి సశేషంగా వొదిలిన వాదన మళ్లీ ఎత్తుకున్నాడు మా శంకరం, నాకూ వాడికీ అక్కడే వొస్తుంది పేచీ: ఆడది శ్రుతి పెట్టి బిగించి సిద్ధంగా వుంచిన వీణలాంటిదట; నేర్పుగా వేళ్లతో మీటితే చాలు, మన ఇష్టమొచ్చిన పలుకు పలుకుతుందట.

"ప్రతి ఆడదీ అంతేనా?" అంటాన్నేను.

"తప్పకండా"

"మరి వొక్కొక్కసారి శతవిధాల ప్రయత్నం చేసికూడా కలిసిరాకపోటానికి కారణం?"

"నీ మొహంలావుంది. ఎప్పుడు, ఏ సమయంలో, ఏ పతకం వెయ్యాలో ఆ పతకం వేస్తే చెట్టు దిగని ఆడది ఉంటుందిటోయ్ చెవలనాగమ్మ?"

దానితోటి నోరుమూసుకున్నాను.

ఒక్కొహడికి తను వెలిగించిన దీపాలన్నిటినీ గురించి వెళ్లబోసుకునేందుకు ఏ సన్నాసి రాముణ్ణో పట్టుకుని కసిదీర్చుకుంటేనేగాని స్తిమితంగా వుండదు; మా శంకరం గాడికి నేను దొరికాను –

రాత్రినించీ ఒక్కటే ధ్యాస. వాడు చెప్పేవన్నీ అక్షరాలా జరిగే వుంటాయా? అవన్నీ కల్పన కింద కొట్టెయ్యడానికి మాత్రం వీలా? ఎత్తుగడలోనూ, ముగింపులోనూ, సందర్భశుద్ధి చెడకండా, మాటకి మాటా అతికేటట్టు, ఎంతరంజుగా కథ నడిపిస్తాడు!

ఇంతకీ వాడు పాపం తన తృప్తికోసమేదో డబ్బా వాయించుకుంటాడేగాని, నా రక్తంలో పాతుకుపోయిన పునాదుల్ని కదిలిస్తోన్న సంగతి గమనించడు. ఎన్నాళ్ళనించో నామనస్సులో జాగర్తగా పోషించుకుంటూ వొచ్చిన నియామకాలమీద అప్రయత్నంగా బాంబులు వొదులుతూవున్న సంగతి తెలియదు పాపం వాడికి.

కొంచెంగా తగ్గించి ఉంచినలాంతరు పూర్తిగా ఆరిపేసి, రగ్గులో తలదూర్చి, రహస్యాలోచనలు ప్రారంభించాను. నేనసలు చాలా బుద్ధిమంతుణ్ణి. అందరి అభిప్రాయమూ అదే. ఆ మంచితనానికిగల కారణాలన్నీ ఇప్పుడిప్పుడు తెలిసి వొస్తున్నట్టనిపించింది. ధైర్యం చెయ్యక పోవడమూ, ప్రతిష్ట పోతుందేమోనని పీకులాటా, రంగంలోకి దిగకముందే రాగల అపాయాలని వందపెట్టి గుణకారించుకుని, నాకునేనే లోలోపల ఉసిగొల్పుకోవడమూ, ఒక్కొక్క అపాయానికి మళ్లీ పదేసి ఉపాయాలచొప్పున కావాలని వెతుక్కోవడమూ - ఒకటా? ఒకప్పుడు తెమిలి చచ్చిందా ఆలోచన?

ఇంతకీ, తెగించాలి -

గణపతి నవరాత్రులికి హరికథలు మంచిరద్దీగా నడుస్తున్నాయి. వెడదామని బుద్ధిపుట్టింది. హరికథల మీద భక్తి సన్నగిల్లి చాలా కాలమయింది. అయితే, అధార్తుగా ఇప్పుడు సరదా పుట్టుకురావడానికి కారణం లేకపోలేదు. మావాడు ఒకటిరెండుసార్లు చెప్పినట్టు జ్ఞాపకం, గుళ్ల వీధిలో వేణుగోపాలస్వామి కోవెలలోకి లక్ష్మణాచార్లు పెళ్లాం జోరుగా వొస్తోవుంటుందని వినికిడి. వొచ్చి చక్కాపోదుట; పక్కచూపులతోటి ఏ అదృష్టవంతుడికో ఉచ్చులుపోసి మరీ వెడుతుందిట. లక్ష్మణాచార్లు పెళ్లామంటే ఊళ్ళో పుకారున్నమాట నిజం.

లెక్కలేనన్నిచోట్ల హరికథలు జరుగుతోంటే, వేణుగోపాలస్వామి కోవెలలోకే ఈడిచి కెళ్లాయి కాళ్లు. టైము తెలియక పెందరాళే వెళ్ళాను గావును, ముందు సీటే వీలైనచోట దొరికింది.

ఆడంగులవైపు కలకలం జాస్తీగావుంది. అప్రయత్నంగా నాకళ్లు అటు వెతుక్కున్నాయి. ఆ స్తంభం వెనక ఎవరామె? పరకాయించి చూచాను. తొణకని సౌందర్యం! ముట్టుకుంటే మరకపడుతుందా అన్నట్టుంది మెడచుట్టూ. చాలామందిచూపులు ఆవిడమీదనే వున్నాయి. మొహాన్ని తిరుచూర్ణంబొట్టు చిరుచెమటకిగావును కరిగిపోతోంది. లక్ష్మణాచార్లు పెళ్ళాం కాదు గదా - చూచాయగా అనుమానం తగిలింది.

శంకరంగాడు డచ్చీలుకొట్టినా, అందులో కొంత నిజంకూడా సకృతుగా మిళాయిస్తుంటాడు. నిజమెంతో అబద్ధమెంతో తేలకండా వుంచాలంటే అంతకంటే మంచి పద్ధతి లేదుగా! ఎందుకూ నావంక అలా పులుకూ పులుకూ చూస్తుందీ? నేను మాటిమాటికీ చూస్తున్న సంగతి గమనించిందా? నాదగ్గర ఏమాకర్షణ వున్నదని? ఒక్కొక్కకంటికి ఒక్కొక్క అందం రుచిస్తుందేమో - రక్తంలో చిన్న చిన్న కెరటాలు లేస్తున్నాయి.

ఉన్నట్టుండి నాకళ్లల్లోకి తళుక్కున చూచి గిరుక్కున లేచింది, వెళ్లిపోటానికి. హరికథ ఇంకా సగం కాలేదు. ఆచూపులో ఎన్ని అర్థాలు మెరిశాయో, ఎన్ని ప్రేమలేఖలు బిలబిలలాడాయో చెప్పలేను.

నన్నుకూడా లేచి రమ్మనమని సిగ్నలా? ఆవిడ అటూ నేనిటూలేస్తే, చూచినవాళ్లు ఈలలుతీస్తారేమో మళ్లీ ఆలోచనలో పడ్డాను.

ఈపాటికప్పుడే కోవెలగుమ్మందాటి బయటికి వెళ్లిపోయి వుంటుంది. తరుణమంటే

ముహూర్తం లాంటిది. మరుక్షణంలో పరిస్థితులు తారుమారైపోతాయి. తెగించి ఒక్కసారి లేచాను. నా పిచ్చిగాని, ఎంతమంది లేచిపోవడంలేదు? అందరూ ఆ పిల్లకోసమే లేచారని కూచున్న వాళ్ళంతా అనుకోబోతారా?

గుమ్మందాటి బైటికివెళ్ళి పోతూంటే, లోపలికొస్తూ ఒకాయన 'కథ ఏమిటండీ?' అని ప్రశ్న. చచ్చాను - అసలుకథ ఏమిటో అవగాహన కాలేదప్పటికి - ఆ ప్రపంచంలో ఉంటేగా!

కొంచెం తాపీగా నడిచిపోతాందా అమ్మాయి. గంగిగోవులా కూడా పడ్డాను. ఒకటి రెండుసార్లు వెనక్కి తిరిగి చూచింది. నేను వస్తున్నానో లేదోనని నిర్ధారణ చేసుకోడానికా? నేను వెనకాల నడుస్తోన్న సంగతి గమనించింది గావును, తొందరగా అడుగువేస్తోంది, అదేమిటి? నన్ను తప్పించుకుని వెళ్లిపోవాలనా? ఇహనేనెలాగూ కుక్కలా వెంటపడ్డానుకదా అని ధీమా?

పమిటకొంగు ముందుకి లాక్కుంటూ పతివ్రతలా నడిచి వెళ్లిపోతోంది. ఆమెనీడ నాపక్కనే, నన్ను రాసుకుంటూ, గంభీరంగా ముందుకి జరుగుతోంది. కదులుతున్న ఆ అందం ఎలక్ట్రిక్‌లైట్ల వెలుతురులో చిందిపోతోన్నట్టుంది. వొదులు వొదులుగా వేసినజడ ఒయ్యారంగా ఊగిసలాడుతూ, కమ్మని దవనం వాసనలు తోవకటూ ఇటూ సమానంగా పంచిపెట్టుకుంటోంది.

ఆ వీధిలో జనమంతగా మసలడంలేదు. అది ఏ పేటలో ఏ వీధో గుర్తులేదు. చల్లగా పలకరిస్తేనో? ఏమని పలకరించడం? మీ ఇల్లెక్కడని ముక్తసరిగా అడిగి ఊరుకుంటే? ఛా! కూడా వెడితే ఇల్లెక్కణ్ణో తెలియనే తెలుస్తుందాయిరి.

ఇలాగే బెల్లిస్తూ ఇంటివరకూ తీసికెళ్ళి మొగుడుతో చెప్పి గలభా చెయ్యదుగదా? ఎవరికి నష్టం? తనేగా అల్లరిపడేది? తెలియదాయేం?

ఆలోచనలకి అంతరాయం కలిగింది. గేటు తెరుచుకుని ఓ చిన్ని బంగళాలాంటి ఇంట్లోకి వెళ్ళిపోతోంది. వెళ్లిపోయేది గేటు వేసుకోవాలా? తెరిచే వుంచేసింది కావాలని. ఎవరికోసమో? వాళ్ల ఆయన లోపల ఉన్నాడేమో? ఏమిటా మొండి ధైర్యం? - లేనిపోని భయాలు చూపుతూ మనస్సు వెనకాడుతోంది.

ఇంతకంటే ఆహ్వానం వేరే కావాలా? అనుమానాలన్నీ భద్రంగా లోపల మణిచిపెట్టి ఇంట్లోకి జొరబడ్డాను.

వెన్నెట్లో నైట్‌క్వీన్ మొక్కపక్కని నించుని పస్తాయించాను.

"ఇప్పుడేవస్తా - డ్రస్సుమార్చుకుని" అని చెవిలో ఊది, లేడిపిల్లలా చెంగున ఇంట్లోకి దూకింది. అనుకోలేదు.

సన్నజాజి పువ్వులవాసన గుప్పుమంది. లేత వెన్నెలజల్లు కొబ్బరిచెట్ల చిక్కని నీలినీడలలో అలుముకు పోతోంది. చిమ్ముకుంటూ లోపలికి నడిచి వెడుతున్నాను. ఆ మసక చీకట్లో, కనపడకండా వెనకాలే వొచ్చి మెత్తగా భుజాలమీద ఒత్తుకుంటుందేమో - రక్తంలో రైళ్లు పరిగెడుతున్నాయి -

లక్ష్మణాచార్లు ఇంతడబ్బున్నవాడా? చుట్టూ పువ్వులతోటా, చక్కనిఇల్లూ, ఎలక్ట్రిసిటీ, ఏమో, షావుకారు గుమాస్తాచేసి మేడలుకట్టిన వాళ్లున్నారు – అయినా, ఇల్లాలింత చక్కనిదైతే, ఇంటికి ఈ మాత్రం నాజూకు అమరడం ఓ లెక్కా?

ఖర్మంకాలి ఇది ఏసాని కొంపైనా కాదుగదా? ఇందాకటినించీ నన్ను పట్టుకుని వేళ్లాడు తున్న సందేహాలన్నీ సల్లిపోయి, ఈ అనుమానం మాత్రం గుదిబండలా పట్టుకుంది. గదిలో అడుగుపెట్టి చూద్దునుగదా, సోఫాలు పువ్వుల గుడ్డతెరలు, ప్యారిస్ ఫొటోలు – ఓ చిన్ని మేజా బల్లమీద పరిచిన అల్లిక రుమాలుమీద "ప్రేమమయి పుష్పానికి ముద్దులతో–" కొంపమునిగింది – బంతిపువ్వు బంతిపువ్వు అంటారు, ఆ బోగంది గావునిది!

అప్పుడిహనేమిటి చెయ్యడం? ఎందుకొచ్చిన కుమ్మరం? బైటికుడాయిస్తే – చదీచప్పుడూ గాకుండా? ఛా! అప్రతిష్ట!! మగతనం లేదనుకుంటుందేమో.

మొహాన్ని తిరుచూర్ణంబొట్టూ, కాళ్లకి చిక్కని పసుపూ, కచ్చాపోసి కట్టినచీరా, జడమీదనించీ ఓరగా తీసిన పమిటకొంగూ, – సానిలక్షణమొక్కటీ అవుపించదే! అర్థంకావటం లేదు. ఇదో వేషమా?

ఇందాకటినించీ ఇన్నివగలుచూపి లాక్కొస్తొ బ్యాంకురోడ్డు బోగంపిల్ల అన్నమాట. కళ్లకి పొరలు విడినట్టనిపించింది. కలలన్నీ కరిగిపోతున్నాయి. కారణం బోధపడదు.

బోగందని తెలియగానే, రక్తం చల్లబడి; శృంగారం ఇంత చచ్చిపోయిందేమో! మీద అలాచెయ్యి వెయ్యనిస్తే చాలుననిపించే ఆ బుగ్గలనునుపూ, యవ్వనజ్వాలని పై కెగజిమ్ముకుంటున్న రొమ్మూ, సన్నని చీర పొరలలోనించీ బైటికి తొంగిచూసే తొడలచిక్కని మెరుగూ, ఒకటేమిటి, ఇందాకటినించీ నావి నావని పడ్డ బులపాటమంతా ఏమయింది? ఆ బుగ్గలేగా, ఆ పెదిమలేగా, ఆ లావణ్యమేగా – ఒక్క క్షణ మూరుకుంటే, వొళ్ళోకొచ్చి వాలబోతుంటే మనస్సు పెదమొహంపెట్టి మొరాయిస్తుందేమిటి?

ఎంతరెచ్చ గొట్టుకున్నా, రక్తంలో నిలిచిన పూల నావలన్నీ తెరచాపలు దింపుకుని ముదుచుక్కూచున్నాయి.

లోపల ఏమిటి చేస్తోంది?

నన్ను మోహించి, లాలించి, అంతమందిలో నన్ను ప్రత్యేకించి, తనచూపులతో నన్ను కట్టేసి, ఇంతదూరం లాక్కొచ్చిన గంధర్వకన్య ఎవరా అని మురిశాను. ఇంతాచేసి బోగంపిల్ల – నాలుగుడబ్బులు వొదుక్కుందామని లాక్కొచ్చింది – ఒహ కొత్తకాతా వోపెనయిందనుకుంటోందో ఏమో! ఆ వేళకి నేను గాకపోతే తలమాసిన వాడెవడో మరొహణ్ణి లాక్కొస్తుంది.

దీనికని ఇంత విరహమెందుకూ? రహస్యంగా పనిగట్టుకుని కూడా పడటమెందుకూ? అనవసరంగా ఆ వీధినించి ఈ వీధికి గంపెడు రొమాన్సు మోసుకొచ్చానే దులిపేసుకోనా?

నరాలు ఏడుస్తున్నాయి. లక్ష్మణాచార్లు పెళ్లాం కాగూడదూ? కాదని ఆఖరికి తెలిసినా

బావుండేదే నిజంగా ఈ వివాహ సంస్థ ఎత్తేస్తే, అందరూ చేతికందుబాటులో ఉంటూంటే, ఆడదానిమీద వ్యామోహమంటూ ఉంటుందా?

నాకదే పట్టుకుంట; సినీమా ఎడ్వర్‌టైజుమెంటు బండిలా నడిచివచ్చింది; రంగులు చూచి, గుంటవెధవాయిలా కూడా పడ్డాను. అంతే. నా తెలివి తెల్లవారితే ఎంతచెడ్డా, కులస్త్రీ ఎవరైనా, ఇంత విచ్చలవిడిగా, ఇంత బహిరంగంగా -

అయినా, దీనితోటి ఇప్పుడేమిటి? పర్సులో నాలుగు డబ్బులున్నప్పుడు, నోటీసు లేకుండా వచ్చి సరుకు బేరంచేసి కొలిపించుకున్నట్టు, ఎన్నిరాత్రుల అనుభవం కావాలో అన్ని అయిదే రూపాయలనోట్లు పారేసి, సావకాశంగా జేబులో వేసుకుని పోవచ్చనే నా మొట్టమొదటి యవ్వనపు పొంగు, ఈసైడు కాలవలో ఈ చెత్తకాయితాల బుట్టలో, విరజిమ్ముకోనా?

బట్టవిప్పి బట్టకడుతోంది గావును, లోపల - ఆ దండల పుష్టీ, తొడలబలుపూ, భుజాల వొంపూ, పిరుదుల గుండ్రతా, ఛాయగా, లీలగా, గుడ్డతెరమీద నగ్నంగా అవుపిస్తున్నాయి; 'హీనా' అత్తరువాసన మాటిమాటికీ ఉండిపొమ్మని బలవంతపెడుతోంది; ఏమి చెయ్యను?

ఇంకొక గడియలో వొచ్చేస్తుంది. ఏదోవొకటి తేల్చుకోకపోతే ఎలా? పరిస్తితులు ఏదో వొకటి బలవంతపెట్టి నిర్ణయించేదాకా గుంజాటనలోపడి కొట్టుకుని, ఆ తరవాత చచ్చినట్టు ఏదోవొకటి చెయ్యడం మామూలేగా నాకు. ఇప్పుడూ అంతే జరుగుతుందా?

గప్పున లేచాను - ఒక్కటేగంతు - గదిలోనించి బైటికీ - గేట్లోనించి వీధిలోకి - ఏమనుకుందో పాపం?

ఏ రాసలీల నెమరుకి తెచ్చుకుంటున్నాడో, తలుపు కొట్టగానే తీశాడు మావాడు.

"తీపాసిలా తిరుగు - చదువా, సంధ్యా?"

చివాట్లు పెట్టడం కూడాను తను మడిగట్టుకున్నట్టు. దీపం ఆరిపేసి, ముసుగు పెట్టుకుని, చీకట్లో చెప్పాను జరిగిందంతా. ఆ దెబ్బతో నిదరతేలిపోయింది వాడికి.

"మరివెనక వోసారి లక్ష్మణాచార్లు పెళ్లామనీ, కోవెలనీ చెప్పుకుంటూ వొచ్చావు - జ్ఞాపక ముందీ?"

'వాళ్లీవూరు వొదిలిపెట్టి రెండుమూడు నెలలయింది.' ఏడిసినట్టేవుంది.

"ఒకసారి నాకూ ఈ అనుభవమయిందొరేయ్" ప్రారంభించాడు. "వెనక ఇలాగే అయ్యంగారి పిల్ల అనుకుని దీనికూడా పడ్డాను."

"మరి తెలిసిం తరువాత?"

"అంతా అయింతరవాతగాని తెలియలే"

"అదృష్టవంతుడవురా"

"చాలా సరదా అయిన మనిషిలే!"

ఎందుకు వొదిలేసి వొచ్చేశానా అనిపిస్తోంది. ఏడిపిస్తున్నాడు వీడు.

"అవునుగాని, ఆవేషమేమిటి? పచ్చిబోగంది సిసలైన శ్రీ వైష్ణవిలాగ-"

"అదో పద్ధతిలే, కొత్తపిట్టల్ని ఆకర్షించడానికి"

"అంటే?"

"పరాయి ఆడది మనమీద కన్ను వేశిందంటే పుట్టుకొచ్చే మోహం, బోగంది కావలించుకుంటే మటుకు వస్తుందిట్రా? ఆ రహస్యం కనిపెట్టిందది."

"అన్నట్టు నీమాట"

"తెలిసిం తరవాత మాత్రం ఊరుకున్నానా?"

"మరి?"

"తెలియనట్టే నటించి తెల్లవారగట్ట చెప్పకుండా వొచ్చేశా."

"ఊరుకుందీ?"

"జేబు తడిమిచూచుకుందిలే. కనిపెడుతూనే వున్నా."

"ఏమన్నా ముట్టిందా?"

"బెడ్డలు"

"రోగం కుదిరింది"

"....."

"అది బోగందని తెలిసిం తరవాత మనస్సు విరిగి పోలేదుట్రా?"

"చెబుతా వినరోయ్ - సైదుకాలవలో పదుతోందని వెన్నెలనిచూచి అసయ్యించుకుంటావుట్రా? కాలవచూడూ ఎన్నివూళ్ళ మీదుగా వొస్తుందోను; చెరువు నీళ్లేగాని స్నానానికి పనికి రావాయేఁ?"

"చాల్లే కవిత్వం"

"నాదారి కొస్తావులే ముందుముందు. అయినా, ఓం ప్రథమం గనక..."

"అయితే?"

"దిక్కుమాలిన తర్కంలో పడ్డావు."

"అంతేనంటావా?"

"ఇహ రగడదేరతావులే. ఫరవాలేదు, పడుకో."